క్లుప్తంగా

## విద్యార్థినులకు వైద్య పరీక్షలు



ధరూరు: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌కేబీఎస్)లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంజేపీ మహిళా గురుకుల కళాశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకాంత విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, హిమోగ్లోబిన్ పెరుగుదలకు మార్గదర్శకాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన కారు

గద్వాల క్రైం: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కారు పొలంలోకి దూసుకెళ్లిన ఘటన బుధవారం వెంకమ్‌పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల నుంచి వెంకమ్‌పేట వైపునకు ఉదయం కారు వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతుండటంతో పొలంలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు పాక్షికంగా ధ్వంసమైంది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు పేర్కొన్నారు.

## నల్లచీరలు ధరించి నిరసన



అయిజ: ఆశా కార్యకర్తలు బుధవారం నల్ల చీరలు ధరించి సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడారు. యూనిఫాంలు పంపిణీ చేసి నాలుగేళ్లు అవుతోందని, వెంటనే యూనిఫాంలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూనిఫాంలు అందజేయాలని వినతి

గద్వాల: జిల్లాలో ఆశా వర్కర్లకు మూడేళ్లుగా యూనిఫాం ఇవ్వకుండా పెండింగులో ఉంచారని వెంటనే యూనిఫాంలు అందజేయాలని సీఐటీయూ అనుబంధ సంస్థ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పద్మ, సునీత డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు బేబి, లక్ష్మి, లలిత, పద్మ, వెంకటేశ్వరమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో యూరియా అందించండి



అలంపూర్: జిల్లాలోని రైతులకు సకాలంలో యూరియాను అందించాలని ఎమ్మెల్యే విజయుడు కోరారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును ఎమ్మెల్యే బుధవారం కలిసిన ట్లు తెలిపారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. పొలాల్లో పనులు చేసుకోవాల్సిన అన్నదాతలు యూరియా కోసం క్యూలైన్లలో నిల్చోవాల్సిన దుస్థితి కలిగిందని పేర్కొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి



అయిజ: ప్రైవేటు పాఠశాలల్లో సీబీఎస్‌ఈ పేరుతో విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రాములుకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాల బీజీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వర్షపు నీరు తొలగింపు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటి పరిధి పదో వార్డులో వర్షపు నీరు నిలిచి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది జేసీబీతో కాల్వలు తీయించి వర్షపునీటిని డ్రైనేజీల్లోకి తరలించారు.



# గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలేవి ?

- పెరుగుతున్న దోమలు, ఈగల వ్యాప్తి
- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



ఉండవెల్లిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ఉండవెల్లి: అసలే గ్రామాల్లో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉంది. దీనికి తోడు భారీ వర్షాలు కురుస్తుండటం, మురుగు నిల్వ ఉండటంతో అల్లాడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో దోమలు, ఈగల ఉధృతి అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా, డెంగీ, డయేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం..**

మండంలోని 4 మేజర్ పంచాయతీలు, 15 గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు వర్షాకాలంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదంటున్నారు.

**నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు**

మండలంలోని 4 మేజర్ పంచాయతీలకు ఒక్కటి చొప్పున 4 ఫాగింగ్ యంత్రాలను మండలానికి కేటాయించారు. నిధులు తక్కువగా ఉండే జీపీలు వేరే జీపీల నుంచి తీసుకొని వాడుకునేలా అధికారులు చర్యలు తీసుకునేవారు.గతేడాది వరకు అడపదడపా వాటి వినియోగం కనిపించినా ఈ ఏడాది మాత్రం నామమాత్రంగా కూడా కన్పించడం లేదు. మండలంలోని ఏ ఒక్క జీపీలలో వీటిని వినియోగించడం లేదు. ఒక్కో ఫాగ్ యంత్రానికి రూ.40 వేల నుంచి రూ.60 వేలు జీపీ నిధులు వెచ్చించి కొనుగోలు చేశారు. వాటి వినియోగంపై అవగాహన లేక పెట్రోల్, డీజిల్, లిక్విడ్ సమపాళ్లలో కలవకపోవడంతో తరుచూ పాడవుతున్నాయని పంచాయతీ సిబ్బంది పేర్కొంటున్నారు. మరమ్మతు చేయించాలంటే ఖర్చు భారీగా అవుతున్నట్లు సమాచారం. దీంతో గతేడాది పాడైన యంత్రాలు ఇప్పటి వరకు మరమ్మతుకు నోచుకోలేదు.

**నిధుల లేమి..**

గతేడాది ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం పథకం చేపట్టగా ఈ ఏడాది కార్యక్రమం ప్రభావం కనిపించడం లేదు. పారిశుద్ధ్య పనులపై గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తుండగా నిర్వహణకు నిధులు లేవని చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు, నిండుగా మురికి కాల్వ, అంతర్గత రహదారులపై మురుగు పారుతుందని ప్రజలు వాపోతున్నారు. కనీసం నిల్వ నీటి మడుగుల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకోవడం లేదని, ఉన్నతాధికారులు ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకోచ్చేలా తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పుల్లూరులో మురికి కాల్వలో నిలిచిన నీరు

**దోమల బెడద**

మా గ్రామంలో మురుగు రోడ్లపై పారుతుంది. కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇందిరమ్మ ఇళ్లు ముగ్గులు వేయడానికి, పరిశీలించడానికే, అధికారులు పరుగులు పెడుతున్నారు. ప్రజల ఆరోగ్యంపై పట్టింపు లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, పుల్లూరు

**ఫాగింగ్ చేయడం లేదు**

మండల కేంద్రంలో దోమల నివారణకు కనీస చర్యలు చేపట్టడం లేదు. ఫాగింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

– జగదేవయ్య, ఉండవెల్లి

## సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలవాలి



రక్తదానం చేస్తున్న అభిమానులు

రాజోళి: సేవా కార్యక్రమాలతో యువత స్ఫూర్తిగా నిలవాలని ఎస్‌ఐ గోకారి అన్నారు. ఈ నెల 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎందరికో ప్రాణాలు నిలిపిన వారవుతారన్నారు. యువత అభిమాన హీరోల కోసం చేసే కార్యక్రమాల్లో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 48 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ దాతల నుంచి సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, ఎంఈఓ భగీరధరెడ్డి, డాక్టర్ మధుబాబు, నిషాక్, వహీద్ బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## మేళాలు పరస్పర అభ్యాసానికి వేదికలు



అలంపూర్ చౌరస్తాలో ఉపాధ్యాయుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

అలంపూర్: టీఎల్ఎం మేళాలు ఉపాధ్యాయుల పరస్పర అభ్యాసానికి వేదికలవుతాయని ఎంఈఓలు శివప్రసాద్, రామకృష్ణ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుల టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా బుధవారం నిర్వహించారు. మేళాలో ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో సృజనాత్మక బోధన పద్ధతులు, బోధన పరికరాలు, మోడల్స్, చార్టులు, ఆకర్షణీయమైన సాధనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల ప్రతిభ, ఆవిష్కరణాత్మక ఆలోచనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుందన్నారు. బోధన సాధనాలు తయారు చేయడం ద్వారా విద్యార్థులు సులభంగా నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. మేళాలు తరచూగా నిర్వహించాలని ఆకాంక్షించారు. మేళాలో ప్రతి సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మానవపాడు, ఉండవెల్లి రెండు మండలాల్లో 20 మంది విజేతలను ఎంపిక చేశారన్నారు. విజేతలను జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాకు పంపడానికి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనిత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు



పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యాధికారులు

గట్టు: మండలంలోని చాగదోన ఆరోగ్య ఉప కేంద్రంలో టీబీ ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో బుధవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి రమేష్ టీబీ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామస్తులతో కలసి టీబీ వ్యాధిపై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. శిబిరంలో టీబీ హైరిస్క్ ఉన్న వారిని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ.. క్రమం తప్పక మందులను వాడితే టీబీ వ్యాధిని అరికట్టవచ్చని సూచించారు. వ్యాధిగ్రస్తులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, గట్టు టీబీ నోడల్ పర్సన్ సోమశేఖర్, ఎస్‌టీఎస్ఎస్ నరేంద్ర, ఏఎన్ఎం జయమ్మ, విఘ్నేశ్వరి, ఆశా వర్కర్లు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## వరద నీటిలో బీచుపల్లి పుష్కరఘాట్లు



శివాలయం సమీపాన కృష్ణానది వరద

ఎర్రవల్లి: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు అధికంగా వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో జూరాల ప్రాజెక్టు నుంచి 44 గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు వదలడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద బుధవారం పుష్కరఘాట్లన్నీ వరదలో పూర్తిగా మునిగిపోయాయి. శివాలయం సమీపంలో వరద ఉధృతంగా చేరుతోంది.



వరద నీటిలో పూర్తిగా మునిగిన పుష్కరఘాట్లు

## అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి

గట్టు: గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆయా వీధుల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాల కోసం పోలీస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ మల్లేష్ కోరారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. గణేష్ మండప నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా, విద్యుత్ ఇతర జాగ్రత్తలను తీసుకొని నిమర్జనం అయ్యే వరకు మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమర్జన వేడుకలో డీజేకు అనుమతి లేదని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండల కేంద్రానికి చెందిన నరసింహ్మశెట్టి బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతిని తెలియజేశారు.

## సబ్సిడీ పేరుతో మోసం

గద్వాల క్రైం: దివ్యాంగుల కోటాలో బైక్ అర్హతకు ఎంపికై నట్లు నమ్మించి రూ. 6,300 వసూలు చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. అయిజ మండలానికి చెందిన దివ్యాంగుడు కుర్వ గోపాల్ ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద బైక్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి సంబంధిత శాఖ అధికారిగా పరిచయం చేసుకొని బైక్‌కు అర్హత పొందినట్లు నమ్మబలికాడు. రిజిస్ట్రేషన్ చేయాలంటే ప్రభుత్వానికి కొంత నగదు చెల్లించాల్సింది గా పేర్కొని అతని వ్యక్తిగత ఫోన్ నంబర్ 99648 34037కు రూ.6,300 నగదు ఫోన్ పే చేయించుకున్నాడు. అనంతరం గోపాల్ నగదు చెల్లించి సంబంధిత వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు బాధితుడు గుర్తించి సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

## బాలల హక్కులపై అవగాహన



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలల హక్కులపై కల్వరి మినిస్ట్రీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన కల్పించారు. విద్య మాత్రమే పిల్లల భవిష్యత్‌ను మారుస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామమూర్తి, రమణయ్య, సింధూరాణి పాల్గొన్నారు.

**విద్యార్థులకు టై, బెల్ట్, వితరణ**

ఆంగ్ల ఉపాధ్యాయుడు వేణుగోపాల్, గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగరాజు ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు పంపిణీ చేశారు.

## ఘనంగా ఉత్సవ విగ్రహ ఊరేగింపు



అయిజ పర్దిపురంలో కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



జూలెకల్‌లో ప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ: కృష్ణాష్టమిని పురస్కరించుకొని ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలని పర్దిపురంలో బుధవారం కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన**

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో లింగమయ్య, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలు, భాజా భజంత్రీల నడుమ హోమం, యాగం అనంతరం శిలా విగ్రహాల ప్రతిష్ఠ గావించారు. ఆడపడుచులకు వడి బియ్యాలు, చీర, సారెలు పెడుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా దేవతా మూర్తులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## యూరియా నిల్వలు పరిశీలించిన డీఎస్పీ



ఉండవెల్లిలో పీఏసీఎస్ గోదాంను పరిశీలిస్తున్న డీఎస్పీ మొగులయ్య

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలోని యూరియా నిల్వలను బుధవారం డీఎస్పీ మొగులయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. పక్క రాష్ట్రాలకు యూరియా తరలకుండా జాగ్రత్తలు పడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాగటూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో డీఎస్పీ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్, సీఈఓ భరత్‌కుమార్, కానిస్టేబుల్ రవి పాల్గొన్నారు.

**ఎల్కూరును సందర్శించిన డీఎస్పీ**

మల్దకల్:మండలంలోని ఎల్కూరు గ్రామాన్ని గద్వాల డీఎస్పీ మొగులయ్య బుధవారం సందర్శించారు. రెండు రోజుల క్రితం గ్రామంలో దళిత మహేష్‌పై కత్తితో జరిగిన దాడికి సంబంధించిన వివరాలు సేకరించారు. దాడికి గల కారణాలను మహేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. పూర్తి వివరాలను సేకరించి త్వరలో నిందితులను అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నా రు. కార్యక్రమంలో ఎస్‌ఐ నందికర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ ఎస్‌ఐ కేశవరావు

మల్దకల్: డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీసీఎస్ ఎస్‌ఐ కేశవరావు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా వలన కలిగే అనర్థాలపై వివరించారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. బడిఈడు పిల్లలతో రైతులు పొలం పనులు చేయించుకోవడం నేరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు జాకీర్‌హుస్సేన్, సువాసిని, జ్యోతి, నాగేశ్వరరావు, బలరాం, ప్రదీప్, లోకేశ్వరి పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాల మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం గద్వాల జిల్లాకు నూతన వ్యవసాయ కళాశాలను మంజూరు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం రామచంద్రారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 8 వ్యవసాయ కళాశాలలు ఉన్నాయని, ఇటీవల మరో మూడు వ్యవసాయ కళాశాలలను ఏర్పాటు చేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందన్నారు. గద్వాల జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడమే సబబని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భగత్‌రెడ్డి, భీమసేనరావు, లక్ష్మణ్‌గౌడ్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం తరలివచ్చిన రైతులు



గట్టులో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

కేటీదొడ్డి/గట్టు: మండలంలోని పాతపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా కోసం రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. అధికారులు వారిని క్యూలో నిల్చోబెట్టి పోలీస్ బందోబస్తు మధ్య ఒక్కో ఆధార్ కార్డుకు రెండు బస్తాలు ఇవ్వడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మండల నాయకులు వెంకన్‌గౌడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పాతపాలెం పీఏసీఎస్ సెంటర్‌కు అదనంగా యూరియా కేటాయించాలని ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులతో మాట్లాడి పాతపాలెం సెంటర్‌కు అదనంగా 2 టన్నుల యూరియాను కేటాయించారు. దీంతో యూరియా నిల్వల ఆధారంగా రైతులకు యూరియా పంపిణీ చేశారు.

☆ గట్టు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున వేచి చూస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. క్యూలైన్లలో పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ పత్రాలను పెట్టి తమ వంతు వచ్చే దాకా ఎదురు చూస్తున్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



ఉండవెల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఎర్రవల్లి కూడలిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ/ఎర్రవల్లి/ఉండవెల్లి: అయిజ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జయన్న, దేవరాజు, మద్దిలేటి, మైనర్ బాబు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

☆ ఎర్రవల్లి మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ కృషితోనే ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కాల్వల ద్వారా రైతులకు సాగునీటిని అందించారన్నారు. బీడుపడిన పొలాలను సస్యశ్యామలంగా మార్చడం కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందరెడ్డి, మద్దిలేటి, నర్సిరెడ్డి, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

☆ ఉండవెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ జయంతి విగ్రహానికి పార్టీ మండలాధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగారాజు, రమేష్, నాగేష్, రమణ, వెంకటేశ్వర్‌రెడ్డి, నయీమ్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రవల్లి: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌సీవీబీడీసీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండల పరిదిలోని వేముల గ్రామాన్ని వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి శివన్న, హెల్త్ అసిస్టెంట్ చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.